క్లుప్తంగా

కనకదుర్గాదేవికి విశేష పూజలు



విశేష అలంకరణలో కనక దుర్గాదేవి అమ్మవారు

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో కొలువైన కనకదుర్గాదేవి ఆలయంలో 16వ వార్షిక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణ, రాత్రికి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కల్యాణరాముడికి గజవాహన సేవ



కల్యాణ రాముడికి విశేష పుష్పాలంకరణ

ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నవాడలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారామలక్ష్మణులను గజవాహనంపై విశేష పుష్పాలంకరణ గావించి గ్రామోత్సవం నిర్వహించారు. అన్నసంతర్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

కావలి: లింగసముద్రం మండలం పెద్దపవనికి చెందిన ప్రేమజంట కసుమూరు దర్గాలో వివాహం చేసుకుని శుక్రవారం కావలి డీఎస్పీని ఆశ్రయించారు. పెద్దపవనికి చెందిన షేక్ షాజీదా, షేక్ షాజహాన్ ప్రేమించుకుంటున్నారు. వీరి వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో కసుమూరు దర్గాలో వివాహం చేసుకున్నారు. రక్షణ కోసం కావలి డీఎస్పీని ఆశ్రయించారు. ఇరువురూ మేజర్లు కావడంతో ఇరు కుటుంబాల నుంచి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

కొలతల ప్రకారం పనులు చేపట్టాలి



కూలీలకు సూచనలిస్తున్న ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్

ఉదయగిరి: మండలంలో ఉపాధి కూలీలు కొలతల ప్రకారం పనులు చేసుకుంటూ గిట్టుబాటు కూలీ నగదు పొందాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. ఆయన శుక్రవారం మండలంలోని సర్వరాబాదు చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలకు సూచనలందించారు. అనంతరం మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలు ఉదయం ఆరు గంటలకే పనులకు వచ్చి పది గంటలకు తిరిగి ఇళ్లకు వెళ్లాలన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



సంగం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ పూరిల్లు దగ్ధం కావడంతో కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. వివరాల్లోకి వెళ్లే మండలంలోని తరుణవాయి గిరిజన కాలనీలో చౌటూరి పోలయ్య కుటుంబ సభ్యులు కూలి పనులకు వెళ్లిన సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది స్థానికుల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. రూ.లక్ష పైన ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. సర్పంచ్ శోభా బాలనాయుడు ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులను అందజేశారు.

నాడు-నేడు పనులు త్వరగా పూర్తిచేయాలి

ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులను హెచ్ఎంలు, పీఎంసీ కమిటీలు త్వరగా పూర్తిచేయాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని సర్వరాబాదు ప్రాథమిక, గడ్డం వారిపల్లె ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు శీనయ్య, ఎలీషా పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న టిప్పర్

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): ముందు వెళ్తున్న ఆటోను ఇసుక టిప్పర్ వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ పెంచలయ్య తలకు బలమైన గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం మండలంలోని చుంచులూరు క్రాస్ రోడ్డు వద్ద 67వ నంబరు జాతీయ రహదారిపై జరిగింది. బాధితుడిన్ని మర్రిపాడు పీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఇక విశాల రహదారి

నిత్యం వేలాది వాహనాల రాకపోకలు, పాదచారులు, మరో వైపు పార్కింగ్ వసతి లేక రోడ్డు పక్కనే వాహనాలు నిలిపివేత. ఖాళీ స్థలంలో తోడుపు బండ్ల వ్యాపారులు, రోడ్డు మార్జిన్ వ్యాపారులతో రద్దీగా ఇరుకుగా ఉండే కావలి గ్రాండ్ ట్రంక్‌రోడ్డు విస్తరణతో ఇరుకు కష్టానికి మోక్షం లభించనుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీగా నిధులు కేటాయించడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా మరో రూ.15 కోట్లు కేటాయించడంతో జీటీ రోడ్డు మరింతగా ఆధునికీకరణ సంతరించుకోనుంది.



రద్దీతో ఇరుకుగా ఉన్న ట్రంక్‌రోడ్డులోని ట్రాఫిక్

- రూ.51.5 కోట్లతో పట్టణంలోని ట్రంక్‌రోడ్డు విస్తరణ పనులు
- తాజాగా సీఎం వైఎస్ జగన్ అదనంగా మరో రూ.15 కోట్లు మంజూరు
- పట్టణ ఉత్తర, దక్షిణ శివారుల మధ్య 6 లేన్లు, 4 లేన్ల రోడ్డుగా విస్తరణ
- పది అడుగుల వెడల్పులతో ఫుట్‌పాత్ నిర్మాణం

కావలి: కావలి పట్టణం గ్రేడ్-1 మున్సిపాలిటీగా మారింది. వాహనాలు, పాదచారులు పెరగడంతో ప్రధాన గ్రాండ్ ట్రంక్‌రోడ్డు ఇరుకుగా మారిపోయింది. నిత్యం ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్న పరిస్థితి. ఇది దశాబ్దాలుగా నెలకొన్న దుస్థితి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నగరబాట కార్యక్రమంలో భాగంగా కావలికి వచ్చిన సమయంలో రూ.9 కోట్లు కేటాయించడంతో అప్పట్లో కొంత మేర విస్తరణ జరిగింది. ఇటీవల పట్టణం విస్తరించడం, పారిశ్రామికరణ, పోర్టు, హార్బర్‌ల నిర్మాణంతో కావలి పట్టణం కేంద్రంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలు, పాదచారుల రద్దీ పెరిగింది. వేగంగా దూసుకొచ్చే వాహనాలతో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోననే భయం వెంటాడుతోంది. అత్యంత ఇరుకుగా ఉండే రోడ్డు పక్కనే తోపుడు బండ్లు, రోడ్డు మార్జిన్ వ్యాపారాలు జరుగుతుండడం, ద్విచక్రవాహనాల పార్కింగ్‌లు చేస్తుండడంతో జీటీ రోడ్డు మరింత ఇరుకుగా మారింది. నిత్యం రోడ్డు ప్రమాదాలు. మరణాలు, క్షతగ్రాత్రులు. అటు వాహనాల డ్రైవర్లు, ఇటు పాదచారులు ప్రమాదభరితంగానే రాకపోకలు సాగిస్తున్నారు.

జాతీయ రహదారి మార్పు తర్వాత..

కావలి పట్టణంలో నడిబొడ్డున ఉన్న ట్రంక్‌రోడ్డు వందల ఏళ్ల చరిత్ర ఉంది. చెన్నై-కోల్‌కతా ఎన్‌హెచ్-5గా ఉండేది. అప్పట్లో ఈ రోడ్డును 'గ్రాండ్ ట్రంక్ రోడ్డు'గా ఉండేది. జాతీయ రహదారిని కావలి పట్టణ పొలిమేరలు మీదుగా మళ్లించి నూతనంగా బైపాస్ రోడ్డును నిర్మించడంతో పట్టణ పరిధిలోని రోడ్డు ఆర్అండ్‌బీ శాఖకు బదిలీ అయిపోయింది. జాతీయ రహదారి శివారు ప్రాంతాల మీదుగా వెళ్తుండడంతో భారీ వాహనాల బెడద తీరిందని భావిస్తున్న తరుణంలో కావలి పట్టణంలో వాహనాలు సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయింది.

రాష్ట్ర విడిపోయాక..

నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దు లో ఉన్న ప్రధానమైన పట్టణం కావడంతో రెండు జిల్లాల పరిధిలోని వందలాది గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం తమ అవసరాల కోసం కావలి పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో బైక్‌లు, కార్లు వేల సంఖ్యలో పెరిగిపోయాయి. ఇదే సమయంలో రాష్ట్రం విడిపోయిన తర్వాత విజయవాడ, గుంటూరు నగరాలు రాజధాని ప్రాంతం కావడంతో కావలి పట్టణం మళ్లీ వాహనాలతో రద్దీ ఏర్పడింది. కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలకు చెందిన అధికారులు, ప్రముఖులు రాజధాని నగరాలకు రాకపోకలు సాగించడానికి కావలి పట్టణం మీదుగా వెళ్లాల్సి వస్తుంది.

తొలుత రూ. 51.5 కోట్లతో విస్తరణ

జీటీరోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సముదాయాలు ఉండడంతో ట్రంక్‌రోడ్డు జనసందోహంతో పాటు, వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఈ క్రమంలో కావలి ట్రంక్‌రోడ్డును విస్తరించడానికి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వివరించారు. ట్రంక్‌రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయమని వినతిపత్రాన్ని అందజేశారు. దీంతో అప్పటికప్పుడే రూ. 51.5 కోట్లతో విస్తరించేందుకు నిధులు మంజూరు చేసి నిర్మాణ సంస్థకు పనులు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్లలో కావలిలో ట్రంక్‌రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని నిర్మాణ సంస్థతో ఒప్పందం చేసుకుంది.

తాజాగా మరో రూ.15 కోట్లు మంజూరు

అయితే ఈ రెండేళ్లలో పెరిగిన ధరల నేపథ్యంలో గతంలో మంజూరు చేసిన నిధులు సరిపోవని, అదనంగా రూ.15 కోట్లు నిధులు మంజూరు చేస్తే కానీ రోడ్డు విస్తరణ పనులు పూర్తికావని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ నెల 12వ తేదీ కావలికి వచ్చిన సీఎం ట్రంక్‌రోడ్డు విస్తరణ పనులకు అవసరమైన మరో రూ.15 కోట్లు అదనంగా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కావలి పట్టణంలోని ప్రస్తుతం సిమెంట్ రోడ్డు ఉన్న ప్రాంతం వరకు ఆరు వరసలు సిమెంట్ రోడ్డును విస్తరిస్తారు. తారు రోడ్డు ఉన్న ప్రాంతాల్లో నాలుగు రోడ్లుగా విస్తరిస్తారు. పట్టణంలోని ఉత్తర శివార్లలో ఉన్న మద్దూరుపాడు నుంచి దక్షిణ శివార్లలోని ముసునూరు వరకు ఈ రోడ్డు విస్తరణ పనులు జరుగుతాయి. ఈ రోడ్డు పొడవు మొత్తం 8 కి.మీ. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజ్ కాలువను నిర్మిస్తారు. రోడ్డుకు ఇరువైపులా పది అడుగుల వెడల్పుతో ఫుట్‌పాత్‌ను నిర్మించనున్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

- మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర రావు

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వంలో అర్జీలు అందేలోపే ప్రధాన సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం 6, 10, 11 వీఆర్ఓ సచివాలయం, 7, 8, 9 వార్డుల మెప్మా సచివాలయాలకు సంబంధించి శుక్రవారం వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది, గృహ సారథులు తదితరులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్ల దృష్టికి వచ్చిన ప్రధాన సమస్యలను నమోదు చేసుకుని అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించి ఆ పనుల్లో లోపాలు ఉంటే సంబంధిత అధికారులకు తెలపాలన్నారు. అర్జీల ద్వారా అందిన సమస్యలను పరిష్కరించి లబ్ధిదారులకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు కౌన్సిలర్లు విజయజ్యోతి, సయ్యద్ నౌషాద్‌బేగం, పుచ్చలపల్లి రాధికారెడ్డి, రమాదేవి, త్రివేణి, గుడి సంధ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కె చిన్నపరెడ్డి, సయ్యద్ జమీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆకాంక్షలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వేణుగోపాల్ రెడ్డి

ఆత్మకూరురూరల్: అర్హులైన పేదలు అందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పనిచేయాలని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై మండలంలోని వాశిలిలో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి గ్రామాల సమస్యలపై సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ వాశిలిలో 196 సమస్యలు నమోదు 164 ఇప్పటికే పరిష్కరించామన్నారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం రూ.20 లక్షలు నిధులు మంజూరు చేసిందని, ఈ నిధులతో రోడ్లు, మురుగు కాలువలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చెలిక రమా హరిబాబు, పంచాయతీ కార్యదర్శి పర్వీనా, ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి ఫరూక్, వైఎస్సార్‌సీపీ నాయకులు గిరినాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు నగదు పురస్కారాలు



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న దాత సోమవరపు భాస్కర్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: మండలంలోని చెర్లోయడవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షల్లో 500పైన మార్కులు సాధించిన తొలి బ్యాచ్ విద్యార్థులకు నాగులపాడుకు చెందిన ప్రభుత్వ హెచ్ఎం సోమవరపు భాస్కర్‌రెడ్డి శుక్రవారం తన సొంత నిధులతో నగదు పురస్కారాలు అందజేశారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈఓ షేక్ నజీర్ సమక్షంలో మొదటి బహుమతిగా ఎ.కార్తికేయరెడ్డికి రూ.10 వేలు, రెండో బహుమతి కె.వివేకానందరెడ్డికి రూ.9 వేలు, 3వ బహుమతి ఆర్.శ్రీదివ్యకి రూ.5 వేలు, 4వ బహుమతి టి.చక్రధర్‌కు రూ.3,500, 5వ బహుమతి హాసినిరెడ్డి రూ.3 వేలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా దాత భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాలగా ఉన్న సమయంలో తాను ఇదే పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేశానని, అప్పట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఈ పాఠశాలకు పలు అవార్డులు వచ్చాయన్నారు. యూపీ పాఠశాలను జెడ్పీ ఉన్నత పాఠశాలగా మారిన క్రమంలో తొలి బ్యాచ్ పదో తరగతి విద్యార్థులకు తమ సొంత నిధులతో ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి సిద్ధం పెంచలనరసయ్య, ఉపాధ్యాయులు జయరాములు పాల్గొన్నారు.

విద్యుత్ కంచెకు వ్యక్తి బలి



తిరుపతి మృతదేహం

ఆత్మకూరు: బొగ్గు బట్టీల వద్ద పందులు రాకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి ఓ యువకుడు మృతిచెందిన ఘటన ఆత్మకూరులో గురువారం అర్ధరాత్రి జరిగింది. ఎస్సై ఎం.శివశంకర్‌రావు వివరాల మేరకు.. ఎరుకలసానినగర్‌కు చెందిన నక్కా తిరుపతి (38) పందులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకు సంబంధించిన పందులు రెండు కనిపించకుండా పోవడంతో వాటి ని వెతుక్కుంటూ గురువారం రాత్రి శాంతినగర్ బీళ్ల వద్దకు వెళ్లాడు. అయితే అక్కడ బొగ్గు బట్టీల వారు అడవి పందులు రాకుండా ఉండేందుకు అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు. వాటిని గమనించని తిరుపతి ఆ తీగలు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం ఈ విషయాన్ని తెలుసుకున్న బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు తిరుపతికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

లోఓల్టేజీ సమస్యకు చెక్

కావలి రూరల్: పట్టణంలోని ముసునూరు, సాయిబాబానగర్, బాలాజీనగర్, సుజికీ షోరూం ఏరియా, రాఘవేంద్ర కాలనీల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న లో ఓల్టేజ్ సమస్యకు చెక్‌పెట్టినట్లు ఏడీఏ ఎం భానునాయక్ తెలిపారు. శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ దాదాపు రూ.30 లక్షల విలువ చేసే ట్రాన్స్‌ఫార్మర్లును నూతనంగా ఏర్పాటు చేసి ప్రజల విద్యుత్ కష్టాలు తీర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులరెడ్డి, లైన్‌మెన్లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

బిట్రగుంట: బోగోలు మండలం ఎస్వీపాళెం, జువ్వలదిన్నె, సీఆర్‌పాళెం సచివాలయాలను కావలి డీఎల్‌డీఓ కనకదుర్గాభవానీ శుక్రవారం తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లో వెల్ఫేర్ కాలెండర్, ఆయుష్మాన్ భారత్, నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పనులు, స్పందన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులు, జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలకు సంబంధించిన రికార్డులు, పనుల వివరాలు పరిశీలించారు. సిబ్బందితో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా సిబ్బంది నిర్మాణాత్మకంగా పనిచేయాలని సూచించారు.

మద్యం అక్రమ విక్రేతల బైండోవర్

ఉదయగిరి: జలదంకి మండలంలో అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను శుక్రవారం కావలి సెబ్ అధికారులు జలదంకి తహసీల్దార్ సీహెచ్ పద్మావతి ఎదుట బైండోవర్ చేశారు. అన్నవరం గ్రామానికి చెందిన నీలం మల్లేశ్వరరావు, గట్టుపల్లికి చెందిన బుట్టి నాగార్జున, చింతలపాళెంకు చెందిన గొట్టిపాటి కొండపనాయుడు అక్రమంగా మద్యం విక్రయాలు చేపడుతుండడంతో కావలి సెబ్ అధికారులు ఇటీవల ఆకస్మిక తనిఖీలు చేపట్టి వారిని అరెస్ట్ చేశారు. ఈ ముగ్గురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ యత్నం

బిట్రగుంట: బోగోలు మండలం కోవూరుపల్లిలోని పోలేరమ్మ ఆలయంలో శుక్రవారం వేకువన గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి ప్రయత్నించారు. ఆలయం తాళాలు పగులగొట్టి చోరీ చేసేందుకు విఫలయత్నం చేశారు. తలుపులు తెరుచుకోకపోవడం, హుండీలో నగదు లేకపోవడంతో దొంగల ప్రయత్నాలు ఫలించలేదు. ఉదయాన్నే ఆలయానికి వెళ్లిన స్థానికులు చోరీ యత్నాన్ని గుర్తించారు. అయితే అమ్మ వారికి సంబంధించిన వస్తువులేవీ చోరీ కాకపోవడంతో పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదు. చోరీ యత్నంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని బిట్రగుంట పోలీసులు కూడా తెలిపారు.

డ్రెస్ కోడ్ పాటించాలి



సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ మస్తాన్‌వలి

ఉదయగిరి: సచివాలయ ఉద్యోగులు డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. ఆయన శుక్రవారం మండలంలోని కృష్ణంపల్లి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బయోమెట్రిక్ హాజరు శాతం తక్కువగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సచివాలయ సేవలు విస్తృత పరచాలన్నారు. సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ సర్వే నమోదులో వెనుకబడి ఉన్నామని, వలంటీర్లు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు సమన్వయంతో సర్వే వేగవంతం చేయాలన్నారు.

ఆదర్శ నేత పుచ్చలపల్లి



సుందరయ్య చిత్రపటానికి నాయకుల నివాళి

ఉదయగిరి: కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శ నేత అని పలువురు కొనియాడారు. స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం, సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం 38వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, ఫరిద్దీన్‌బాషా, విజయమ్మ, నాగేశ్వరరావు, కృష్ణ, సుదర్శన్, నాయబ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి పుచ్చలపల్లి

ఆత్మకూరు: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య పేదల పాలిటి పెన్నిధి అని పలువురు వక్తలు అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా స్థానిక బీఎస్సార్ సెంటర్‌లో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. సీపీఎం నాయకులు డేవిడ్‌రాజు, లక్ష్మీపతి, ఆత్మకూరు నాగయ్య, సీఐటీయూ నాయకులు శివప్రసాద్, హజరత్తయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

సంగం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అన్నెం సురేష్, నాయకులు పాల్గొన్నారు.

సుందరయ్యకు నివాళులు

కావలి: సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సమీపంలో సుందరయ్య చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులర్పించారు. కమ్యునిస్ట్ నాయకుడిగా, రైతాంగ సాయుధ పోరాట ప్రతినిధిగా, నిరాబండరతకు నిలువెత్తు చిహ్నంగా సుందరయ్య అందించిన సేవలను ఈసందర్భంగా గుర్తుచేసుకున్నారు.

పుచ్చలపల్లికి ఘన నివాళి

మర్రిపాడు (ఆత్మకూరురూరల్): మర్రిపాడులో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. పలు ప్రజాసంఘాల ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌ప్రసాద్, ఐద్వా మండల అధ్యక్షురాలు మూలి ప్రమీల, సీపీఎం మండల కార్యదర్శి రహంతుల్లా, సీఐటీయూ మండల కార్యదర్శి రత్నమ్మ, భవన నిర్మాణ కార్యదర్శి జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం

- విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం



బట్టేపాడు వద్ద గాలీవానకు ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

ఆత్మకూరురూరల్: గురువారం రాత్రి ఆత్మకూరు పరిసరాల్లో గాలీవానా సృష్టించిన బీభత్సవం విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం మిగిల్చింది. మండలంలోని బట్టేపాడు, నల్లపరెడ్డిపల్లి, మురగళ్ల, గొల్లపల్లి, బోయలచిరివెళ్ల, కరటంపాడు వైపు వెళ్తున్న 33 కేవీ విద్యుత్‌లైన్లు స్తంభాలు కూలి, చెట్ల కొమ్మలు విరిగి పడి ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో శుక్రవారం ఉదయం నుంచి విద్యుత్‌శాఖ ఏఈ వంగల్లు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరాకు పూనుకున్నారు. ఏఈ మాట్లాడుతూ తమ శాఖకు రూ.20 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని, పూర్తి స్థాయిలో పునరుద్ధరణకు మరో 24 గంటల సమయం పడుతుందన్నారు. వ్యవసాయ విద్యుత్‌కు నిర్దేశిత సమయాల్లో రైతులకు అందించలేమని, అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు. సాధ్యమైనంత త్వరితంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- దగదర్తి ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్‌నాయుడు



ఆరు పడకల వార్డును ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రసాద్‌నాయుడు

దగదర్తి (కావలి): రాష్ట్రంలోని పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు దగదర్తి ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్ నాయుడు అన్నారు. దగదర్తిలోని ప్రభుత్వ వైద్యశాలలో సుమారు రూ.9 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరు పడకల వార్డును, ఇతర వైద్య పరికరాలను ఎంపీపీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం మారుమూల గ్రామాల్లోని ఆస్పత్రుల్లో కూడా వైద్య సదుపాయాలు మెరుగు పరుస్తున్నట్లు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ పేరుతో ప్రతి కుటుంబానికి వైద్యులను అందుబాటులో ఉంచడంతో పాటు ఆస్పత్రుల్లో ప్రాథమిక సౌకర్యాలు, ఆధునిక పరికరాలు, మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాగు, సాగునీటి సరఫరాకు చర్యలు

- మెట్టుకూరు ధనుంజయరెడ్డి



మాట్లాడుతున్న మెట్టుకూరు ధనుంజయరెడ్డి

కలిగిరి: నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి తాగు నీరు, ప్రతి ఎకరాకు సాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటామని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి తెలిపారు. కలిగిరిలోని జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి నివాసంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన ఇక్కడ ఫ్లోరైడ్ ప్రభావం ఎక్కువగా ఉండడంతో ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించడానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని చూస్తుంటే ప్రతిపక్షాలు అడ్డుకోవడానికి కుయుక్తులు పన్నుతున్నాయన్నారు. దళితులను కించపరుస్తూ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, మండల యూత్ కన్వీనర్ కోడూరు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు ఎం. శ్రీనివాసులురెడ్డి, ఎ.ఆదిశేషారెడ్డి, సర్పంచ్ రాగి దివ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



ఆర్టీసీ కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న డిపో మేనేజరు కరీమున్నీసా

ఆత్మకూరురూరల్: వేసవి తీవ్రత నేపథ్యంలో ఆత్మకూరులోని డాక్టర్ బీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజరు కరీమున్నీసా చేతుల మీదుగా సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము అడిగిన వెంటనే కార్మికులకు, సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు సమకూర్చిన తారక్ నాథ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బీఎస్సార్ ట్రస్ట్ ప్రతినిధులు మలినేని కొండయ్య, మహమ్మద్ సాధిక్ హుస్సేన్, సీటీఐ నాగభూషణం, ఏఎంఎఫ్ వర్మ, కార్మిక నాయకులు చంద్రశేఖర్, డిపో సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

కలికి శ్రీహరిరెడ్డికి ఘన సత్కారం



కలికి శ్రీహరిరెడ్డిని సత్కరిస్తున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ సుబ్బారావు వైద్యసిబ్బంది

కావలి: రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ ఈసీ మెంబర్‌గా ఎన్నికైన కలికి శ్రీహరిరెడ్డిని కావలి ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది శుక్రవారం ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఏరియా వైద్యశాల అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా ఉన్న శ్రీహరిరెడ్డికి స్థానికంగా మంచి గుర్తింపు ఉంది. సేవాదృక్పథంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు సౌకర్యాలు కల్పించడం, అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వాళ్లకు అందించే ఏర్పాట్లు చేయడం, తదితర సేవా కార్యక్రమాలతో మానవతావాదిగా, సామాజిక కార్యకర్తగా ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ సుబ్బారావు ఆధ్వర్యంలో శ్రీహరిరెడ్డిని సత్కరించి అభినందనలు తెలియజేశారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్

అల్లూరు: అల్లూరు నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ ఫణికుమార్, స్థానిక వైఎస్సార్‌సీపీ నేత నీలం సాయికుమార్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నగరపంచాయతీ కార్యాలయానికి వివిధ పనుల నిమ్మితం వచ్చే ప్రజలకు తాగునీటిని అందించి దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేశామన్నారు. ఏఈ వినోద్, నాయకులు షేక్ ఉస్మాన్ షరీఫ్, బత్తల సుధాకర్, చెంతాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.